క్లుప్తంగా

నారసింహావతారంలో జగన్నాథుడు



నారసింహావతారంలో దర్శనమిచ్చిన స్వామి

మునగపాక: మండలంలోని మునగపాక,నాగులాపల్లి గ్రామాల్లో జగన్నాథస్వామి శుక్రవారం నారసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు

మునగపాక: మండలంలోని పంచాయతీల కార్యదర్శులకు స్థాన చలనం కలిగింది. తోటాడ కార్యదర్శి శ్రీలక్ష్మిని టి.సిరసపల్లికి, సిరసపల్లి పంచాయతీ కార్యదర్శి దుర్గను మెలిపాకకు బదిలీ చేశారు. కశింకోట మండలం సోమవరం పంచాయతీ కార్యదర్శి కాంద్రేగుల లక్ష్మీనారాయణను మునగపాక మండలం తోటాడకు బదిలీ చేశారు.

ఎంఈవో-2కు అభినందనలు



రెండో ఎంఈవో జోష్‌కు అభినందనలు తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

కోటవురట్ల: రెండో ఎంఈవో జోష్‌ను పీఆర్‌టీయూ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎంఈవోను కలిసిన వారిలో పీఆర్‌టీయూ నాయకులు అబ్దుల్లా, వి.వి.ఎస్.హరికృష్ణ, ఆర్.ప్రతాప్‌కుమార్, ఆర్.నానిమణిమోహన్, పి.డేవిడ్ తదితరులున్నారు.

మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారిగా విమలగిరి



నంది విమలగిరి

మునగపాక: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిగా నంది విమలగిరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వైద్య ఉద్యోగుల బదిలీల్లో భాగంగా రోలుగుంట పీహెచ్‌సీ నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు.

చల్లబడిన వాతావరణం

మునగపాక: మండల వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత కొద్ది రోజులుగా ఎండ వేడిమి, వడగాడ్పులకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం చిరుజల్లులు కురవడంతో పాటు వాతావరణం చల్లగా ఉండడంతో మండల వాసులు ఉపశమనం పొందారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాంబిల్లి: కొత్తపట్నంలో శుక్రవారం డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆర్.సన్యాసిరావు, కారె రాముడు తదితరులు శ్యాం ప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ ముఖర్జీ దేశానికి విశేష సేవలదించారని కారె రాముడు తెలిపారు.

30లోగా ఇంటి పన్ను చెల్లించాలి

యలమంచిలి: మున్సిపాలిటీలో ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాలకు రాయతీతో కూడిన పన్ను చెల్లింపునకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని యలమంచిలి మున్సిపల్ ఆర్‌వో నీలిమ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పన్నులు త్వరితగతిన చెల్లించాలని ఆమె కోరారు.వార్డు సచివాలయం, పురపాలక సంఘం కార్యాలయంలోగాని, ఆన్‌లైన్‌లో గాని పన్ను చెల్లించవచ్చని పేర్కొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌కే సాధ్యం

- 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



గవరపేటలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: సంక్షేమ పాలన అందించడం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కోటవురట్ల సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత శివారు గ్రామాలైన జానకీరాంపురం, గవరపేటల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిచ్చారు. జానకీరాంపురంలోని ఓవీధిలో సీసీ రోడ్డు పల్లంగా నిర్మించడంతో మట్టి పేరుకుపోయి బురదమయంగా మారుతోందని ఎత్తుచేయాలని, గవరపేటలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మించాలని, బోరు వేయాలని గ్రామస్తులు కోరారు. ఇందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కోటవురట్ల సంతబయలు, ముస్లిం వీధిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరత్నాలులో భాగంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూనే గ్రామ స్థాయిలో సుపరిపాలన అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. సంక్షేమ పథకాల నిధులు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమచేస్తున్నారన్నారు. చిన్నారులకు బంగారు భవిష్యత్తును ఇచ్చేందుకు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నట్టు చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ బస్సు యాత్ర, పవన్ వారాహి యాత్ర చేపట్టి ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. నమ్మిన వాళ్లను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. మోసగాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పా లని తెలిపారు. ప్రజల క్షేమం కోసం ఆలోచిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని సగౌరవంగా సీఎంగా చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీకి అత్యధిక మెజార్టీ కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, సర్పంచులు బి.అనిల్‌కుమార్, కె.శివకుమార్, ఎంపీటీసీలు పెట్ల రాంబాబు, వి.రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శెట్టి రమణ, గొల్లు చిట్టిబాబు, పైల నాని, శానాపతి రామునాయుడు, కో-ఆప్షన్ మెంబర్ ఖుదాబాషా, మాజీ జెడ్పీటీసీ నీలేంద్రరావు, ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, తహసీల్దారు జానకమ్మ, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, పీఆర్ జేఈ వర్మ పాల్గొన్నారు.

నేడూ సచివాలయం-1 పరిధిలోనే..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కోటవురట్ల సచివాలయం-1 పరిధిలోనే రెండో రోజు శనివారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు తెలిపారు. ఉదయం 6గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లిసమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. అధికారులు ప్రజాప్రతినిధులు,వలంటీర్లుపాల్గొనాలని కోరారు.

నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



వై.వి.సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డికి అచ్యుతాపురంలో వినతిపత్రం అందజేశారు. నేవీ నిర్వాసితుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీపీఎం నాయకులు ఆర్.రాము, జి. దేముడునాయుడు తదితరులు అందజేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని సుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్టు దేముడునాయుడు తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న డీడీ రాజేశ్వరి

ఎస్.రాయవరం: టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన స్థానిక బీసీ వెల్ఫేర్ వసతి గృహం విద్యార్థులకు శుక్రవారం బీసీ వెల్ఫేర్ డీడీ రాజేశ్వరి ప్రోత్సాహక నగదు బహుమతి, మెరిట్ పత్రాలను అందజేశారు.ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో వరుసగా నిలిచిన గొర్ల హరిబాబు, యలమంచిలి అనిల్,కారే నానీలకు రూ.2000 చొప్పున నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో వసతి గృహం ఇన్ చార్జ్ నాగేశ్వరరావు, యలమంచిలి బీసీ వెల్ఫేర్ వార్డెన్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పశు బీమాతో రైతులకు మేలు



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక: వైఎస్సార్ పశు బీమా పథకం రైతులకు ఎంతో మేలు చేకూరుస్తుందని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. స్థానిక ముసలితల్లి మూలసంఘ పరిధిలోని రైతులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీమా ప్రీమియంలో ప్రభుత్వం రాయితీ అందజేస్తుందన్నారు. వరదలు,తుపానులు, పిడుగుపాటు,అడవి జంతుల దాడి,అగ్ని ప్రమాదాలు,అనారోగ్యంతో జీవాలు చనిపోతే బీమా వర్తిస్తుందన్నారు.

కె.వెంకటాపురంలో పారిశుద్ధ్య పనులు



డ్రైనేజీలో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, డ్రైనేజీలలో పూడిక తీశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ పారిశుద్ధ్య మెరుగుకు అంతా సహకరించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విత్తన పంపిణీకి సన్నద్ధం

- మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా నేడు ప్రారంభం



కశింకోటలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన వరి విత్తనాలు (ఇన్‌సెట్) వ్యవసాయ అధికారి స్వప్న

కశింకోట : మండల రైతాంగం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సాగుకు వీలుగా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. కశింకోట ప్రధాన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 19 ఆర్బీకేల్లో ఆయా ప్రాంత రైతులకు 620 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. వీటిలో ఈ ప్రాంతంలో ఎక్కువగా పండించే ఆర్‌జీఎల్ రకం 550 క్వింటాళ్లు, సాంబమసూరీ 51 క్వింటాళ్లు, సోనామసూరీ, ఎంటీయు-1318 రకం నూతన విత్తనాలను కూడా అందుబాటులో ఉంచామన్నారు. వీటిలో ఎంటీయూ రకం విత్తనాలను కశింకోట, వెదురుపర్తి, నూతలగుంటపాలెం, జెట్టపురెడ్డితుని తదితర ప్రాంతాల్లో సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఇది ఆర్‌జీఎల్ రకానికి ప్రత్యామ్నాయమన్నారు. దిగుబడి, నాణ్యత ఆశాజనకంగా ఉంటుందని పేర్కొన్నారు. దీన్ని గత ఏడాది శాంపిల్ సీడ్‌గా రైతులు పండించిన విషయాన్ని గుర్తు చేశారు. దిగుబడి బాగానే వచ్చిందన్నారు. కశింకోటలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో శనివారం వరి విత్తనాల పంపిణీని ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. సాంబ మసూరీ విత్తనాలు 25 కిలోలు, మిగిలినవి 30 కిలోల పరిమాణంలో పంపిణీకి సిద్ధం చేశామన్నారు. రైతులు విత్తనాల కొనుగోలుకు ముందుగానే చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే 80 శాతం వరకు పూర్తైనట్టు తెలిపారు. ఈ ఏడాది మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 892 హెక్టార్లుగా ఉంటుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న రోలుగుంట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి

రోలుగుంట: గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఇవ్వాలని రోలుగుంట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.హేమావతి కార్యకర్తలను ఆదేశించారు. రావికమతం ప్రాజెక్ట్ నుంచి ఇటీవల బదిలీపై వచ్చినామె తొలిసారిగా శుక్రవారం మండలంలోని కొమరవోలు, కొండపాలెం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. గుడ్లు, వంట సరకులకు సంబంధించిన నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. వచ్చిన చిన్నారులను హాజరుతో సరిపోల్చారు. కొండపాలెం కేంద్రం-2లో ఈమె సందర్శన సమయంలో బాలింతలు, గర్భిణులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న విధంగానే పోషకాహారం అందించాలని కార్యకర్తను ఆదేశించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి కె.నూకరత్నం పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందడంతోపాటు వెనుకబడి ఉండే వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. మండలానికి మరింత గుర్తింపు తీసుకువచ్చేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణశ్రీ, ఎంఈవోలు నరేష్, మూర్తి పాల్గొన్నారు.

శివారు గ్రామాలను అభివృద్ధి చేస్తాం



బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

నాతవరం: ఎం.బెన్నవరం పంచాయతీ శివారు గ్రామాలను సైతం అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంజూరు చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యుడు తమరాన లోవకృష్ణ, సర్పంచ్ మూర్తి నాగమణి తెలిపారు. ములగపూడిలోని శ్మశానవాటికలో శుక్రవారం వారు చేతిపంపు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి సుస్థిరమైన స్థానాన్ని పొందారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇట్టంశెట్టి గోవిందరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమరాన రాము, కార్యకర్తలు గొడితి సాయిబాబా, లోకావరపు సత్తిబాబు (బంగారం) పంచాయతీ కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ జేవీకే కిట్లు

కశింకోట : జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లను శత శాతం విద్యార్థులకు పంపిణీ చేయాలని ఎంఈవో కె.చిట్టిబాబు తెలిపారు. కశింకోటలో మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు రాగి జావ, చెక్కీలను తప్పనిసరిగా అందించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన సాగించాలని సూచించారు. మరో ఎంఈవో మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. జేవీకే కిట్లు అందలేదన్న ఫిర్యాదు రాకుండా విద్యార్థులందరికీ అందించాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవో-2 మూర్తిని ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

- గొలగాం ఎల్లారమ్మ కాలనీలో రూ.12 లక్షలతో సీసీ డ్రైన్

అనకాపల్లి రూరల్ : మారుమూల గ్రామాల్లో శివారు కాలనీలకు సైతం సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో, గొలగాం సచివాలయం పరిధి ఎల్లారమ్మ ఎస్సీ కాలనీలో రూ.12 లక్షల మండల పరిషత్ నిధులతో ప్రధాన మురుగుకాల్వ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సంతృప్తి స్థాయిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న తమ ప్రభుత్వం గ్రామాలు, కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, కనీస మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రజలందరికీ మేలు జరిగేలా పాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో గొలగాం, శంకరం గ్రామ సర్పంచులు శలపురెడ్డి నాగ నరసింగరావు, పసుపులేటి లక్ష్మి, పసుపులేటి రామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, గొలగాం 12వ వార్డు సభ్యురాలు గుబ్బల నూకాలతల్లి, ఎస్సీ కాలనీ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి కొసిరెడ్డి కనకరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివకుమార్, గ్రామ వలంటీర్లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

రైతు సంతోషంగా ఉండాలి



కోటవురట్ల ఆర్బీకేలో రైతుకు వరి విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: రైతు సంతోషంగా ఉన్నప్పుడే సమాజం బాగుంటుందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజుగా చూడాలని మహానేత వైఎస్సార్ తపించేవారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంతకు మించి రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా ఆసరా కల్పిస్తున్నారని చెప్పారు. గ్రామ స్థాయిలోనే ఆర్బీకేలను ఏర్పాటు చేసి, రైతులకు సమస్త సేవలు అందిస్తున్నారన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో పాటు, సాగు యంత్రాలను రాయితీపై అందిస్తున్నారని చెప్పారు. సకాలంలో విత్తనాలను అందించడమే కాకుండా ముందుగానే సాగు పెట్టుబడి నిధులను రైతుల అకౌంట్లలో జమచేస్తున్నారని తెలిపారు.గతంలో విత్తనాల కోసం రైతులు మండు టెండలో క్యూకట్టి నానా అవస్థలు పడేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీలు పెట్ల రాంబాబు, వంగలపూడి రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణ, శెట్టి రమణ, గొల్లు చిట్టిబాబు, ఎస్.వి.రమణమూర్తి, ఉగ్గిన ఈశ్వరరావు, వ్యవసాయాధికారి భీమిరెడ్డి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



సురక్ష కార్యక్రమం తిలకిస్తున్న జెడ్పీటీసీ దేవి

ఎస్.రాయవరం: పేదల పక్షపాతి సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని జెడ్పీటీసీ కాకర దేవి అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం తిలకించిన అనంతరం ఆమె మాట్లాడుతూ జగనన్నసురక్షలో నిర్ణీత సమయంలో ధ్రువీకరపత్రాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకునేలా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు,ఎస్.రాయవరం సర్పంచ్ భూపతి అప్పారావు, ఎంపీటీసీ బైసా శ్రీనివాసరావు ,ఈవోపీఆర్డీ సత్యనారాయణ, గృహ నిర్మాణశాఖ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల వారీగా జగనన్న సురక్ష

ఎస్.రాయవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వచ్చేనెల 1వ తేదీ నుంచి గ్రామాల వారీగా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. జులై 1న తహసీల్దార్ టీం ఎస్.రాయవరం సచివాలయం-1,ఎంపీడీవో టీమ్ తిమ్మాపురం సచివాలయం-1 లో అందుబాటులో ఉండి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. జులై 3న ఎస్.రాయవరం సచివాలయం- 2, తిమ్మాపురం-2లో, 5న సర్వసిద్ధి సచివాలయం, కొరుప్రోలు, 7న సైతారుపేట,గుర్రాజుపేట, 10 న జేవీపాలెం,పెదఉప్పలం, 12న ఉప్పరాపల్లి ,కొత్తరేవుపోలవరం, 14న లింగరాజుపాలెం,దార్లపూడి-1 లలో, 17 న వాకపాడు, దార్లపూడి- 2లలో, 19న ధర్మవరం, చినగుమ్ములూరులలో, 21 పెనుగొల్లు, పెట్టుగోళ్లపల్లి, 24 న వమ్మవరం, పెదగుమ్ములూరు, 26న గెడ్డపాలెం,గుడివాడలలో అధికారుల బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలని ఇప్పటికే సచివాలయ సిబ్బందికి, గ్రామ వలంటీర్లకు సూచించినట్టు చెప్పారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ గణేష్

యలమంచిలి: విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని స్థానిక ఎక్సైజ్ ఎస్‌ఐ గణేష్ తెలిపారు. స్థానిక పూర్ణసాయి వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు వినియోగించినా, తరలించినా చట్ట రీత్యా నేరమని చెప్పారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. ఈకార్యక్రమంలో సెబ్ అధికారులు, కళాశాల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష

- ఎంపీడీవో హనుమంతరావు



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: అన్ని శాఖల అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారంతో నిబంధనల ప్రకారం పని చేస్తే ఆశయం నెరవేరుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఆశించిన విధంగా నిర్దేశించిన పనులు చేయగలుగుతామన్నారు. వచ్చే నెల ఒకటి నుంచి ఇంటింటికీ వెళ్లి 11 రకాల సేవలందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వైస్ ఎంపీపీ పైల సునీల్, నాతవరం ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి : దేవరాపల్లి ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: అర్హులందరికీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి కోరారు. ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలపై ఆరా తీసి పరిష్కరించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం చరిత్రాత్మకమన్నారు. శనివారం నుంచి జరిగే గృహ సందర్శనలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితోపాటుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి గ్రామ సచివాలయాల్లోని క్యాంప్‌లో సైతం అధికారులతో కూడిన బృందాలతో పాల్గొని పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్‌లు చింతల సత్య వెంకటరమణ, కర్రి సూరినాయుడు, రొంగలి వెంకటరావు, దాడి జగన్, ఎంపీటీసీలు రొంగలి నారాయణమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడంతో పంట దిగుబడులు బాగుంటున్నాయని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం కర్రివారి వీధిలో శుక్రవారం రైతులకు వరి విత్తనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులకు ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలను ఏటా ఆర్‌ఏ ఆర్‌ఎస్ నుంచి తీసుకొచ్చి అందిస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, రైతులు కర్రి మోదునాయుడు, పొలిమేర ఆదిబాబు, కర్రి కృష్ణ, సన్యాస అప్పారావు, బలరాం, అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.